**భారత**
**కమ్యూనిస్టు**
**పార్టీ**
**(మార్క్సిస్టు)**

# యువజన రంగం

## విధానాలు – కర్తవ్యాలు

*2017 అక్టోబర్ 14 – 16 కేంద్ర కమిటీ ఆమోదించిన తీర్మానం*

*ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ*

**(1)** 18వ పార్టీ మహాసభ నుండి మనం విద్యార్థి, యువజన రంగాల ప్రాధాన్యత గురించి, యువజన రంగంలో మనం అనుసరించాల్సిన విధానాన్ని, కర్తవ్యాలను నిర్దేశించే ఒక పత్రాన్ని ఖరారు చేయాల్సిన ఆవశ్యకత గురించి చర్చిస్తున్నాం. 2007 మార్చి 31 – ఏప్రిల్ 2 తేదీల్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం "విద్యార్థి రంగం – విధానాలు – కర్తవ్యాలు" అన్న పత్రాన్ని ఆమోదించింది. ఈ రంగంలోని ప్రాధాన్యతలను, మన దృక్పథాన్ని గురించిన ఒక స్పష్టమైన అవగాహనని పెంపొందించుకోవడం దీని లక్ష్యం. అందువలన కార్మిక రంగంలోనూ, రైతు రంగంలోనూ మన కేంద్ర కమిటీ ఆమోదించిన సమీక్షా పత్రాల మాదిరిగా ఈ పత్రం వుండదు.

**(2)** 1980 దశకంలో ఒక దేశవ్యాపిత ఉద్యమంగా యువజనోద్యమం ఏర్పడినప్పుడు యువత ముందు 'సోషలిజం స్థాపన' అనే ఒక ఆదర్శం ఉండేది. ఇదే కాలంలో నూతన ఆర్థిక విధానాలు నెమ్మదిగా అమలు కావడం మొదలైంది. ఒక దశాబ్ద కాలంలోనే సోవియట్ యూనియన్, తూర్పు యూరప్‌లోని సోషలిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయి. సహజంగానే సోషలిజం మనుగడపైన, దానిని ఒక ఆదర్శంగా పరిగణించడంపైనా పలు సందేహాలు, సవాళ్ళు బలంగా తలెత్తాయి. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ప్రధాన చోదక శక్తిగా తయారైంది. వినియోగదారీతత్వం, వ్యక్తివాదం, కెరీరిజం బలమైన ప్రభావాలు కలిగించగలిగాయి. తూర్పు ఆసియా

సంక్షోభంతో మొదలై తీవ్ర ఆర్థిక మాంద్యంగా పరిణమించి, 2008లో ప్రపంచ వ్యాపితంగా ఆర్థిక సంస్థలు కుదేలవడం దరిమిలా అభివృద్ధి వేగం మందగించింది. ఇలా పదే పదే వ్యక్తమైన పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభం యువజనులపై తీవ్రమైన ప్రభావం చూపింది. గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి యువజనులలో నిరుద్యోగం పెరిగింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.వో) అంచనాల ప్రకారం ప్రపంచం మొత్తంగా యువజనులలో నిరుద్యోగం 13% ఉంది. ఇది 2015తో పోల్చితే ఎక్కువ. పనిచేసే యువతలో 38% మంది దుర్భర దారిద్ర స్థాయి నుండి సుమారు స్థాయి, ఒక మోస్తరు పేదరికంలో బ్రతుకుతున్నారని ఐఎల్‌వో నివేదిక పేర్కొంది. వారి చుట్టూ నెలకొన్న ఈ జీవన పరిస్థితులు సమకాలీన యువత ఆలోచనపై ప్రభావం చూపుతున్నాయి.

2014లో 35 దేశాలలో జరిపిన సర్వేలో ఆధునిక యువజనులలో సగానికిపైగా యువకులు ప్రస్తుత ప్రభుత్వాలపై భారీ స్థాయిలో తిరుగుబాటు చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేసారు. ఈ ధోరణి 'వాల్‌స్ట్రీట్ ముట్టడి', "అరబ్ వసంతం" వంటి ఉద్యమాలలో ప్రతిబింబించింది. ముఖ్యంగా స్పెయిన్, గ్రీస్, ఫ్రాన్స్ దేశాలలో ఈ ధోరణి కనబడుతోంది. బ్రిటన్‌లో జరిగిన ఎన్నికల్లో లేబర్ పార్టీ నాయకులు జెరెమీ కోర్బిన్‌కు పెద్దఎత్తున యువజనుల నుండి మద్దతు లభించింది. యువజనులలోని అసంతృప్తి, వారి సమస్యలను పెట్టుబడిదారీ విధానం పరిష్కరించలేకపోవడం – దీని పర్యవసానంగా రాజకీయ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనాలనే ధోరణి, ప్రత్యామ్నాయాలను అన్వేషించే ధోరణి యువజనులలో పెరిగాయి. ఇలా అన్వేషించే వారిలో ఎక్కువమంది సోషలిజం పట్ల ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని ఇటీవల అమెరికాలో జరిగిన ఒక సర్వే వెల్లడించింది. 43% మంది యువజనులు సోషలిజంపట్ల సానుకూలత వ్యక్తం చేశారు. తమ తమ దేశాల్లో నెలకొన్న రాజకీయ వ్యవస్థల యెడల, ఇప్పటికే పాతుకుపోయి వున్న రాజకీయ పార్టీల యెడల ఏ మాత్రమూ వారికి నమ్మకం లేదు. యువతలో జరుగుతున్న ఈ రాజకీయ మధనాన్ని

వీలయినంత వరకు పెరుగుతున్న అసంతృప్తిని మితవాద పార్టీలు తమకు అనుకూలంగా మలచుకుంటున్నాయి. దీనికి తోడు జాతి, ప్రాంత, మత ప్రాతిపదికన విద్వేషాలు రెచ్చగొడుతున్నాయి.

సాంకేతిక రంగంలో వస్తున్న మార్పుల పట్ల యువత వెనువెంటనే స్పందిస్తున్నారు. ఈ మార్పులను తమ నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి అనువుగా స్వీకరిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సమాచారాన్ని మార్పిడి చేసుకుంటున్నారు. పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. జీవనోపాధిని వెతుక్కోవడానికి, మెరుగుపర్చుకోవడానికి వినియోగిస్తున్నారు. అదే సమయంలో రాజకీయ భావాలను ప్రచారం చేయడానికి, సమీకరించడానికీ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. బ్రిటన్‌లో అలవాటుగా వున్న నిర్లిప్తతను వదిలిపెట్టి పెద్ద సంఖ్యలో ఓటింగ్‌కు యువత తరలిరావడంతో ఇది కొట్టవచ్చినట్టు కనపడింది.

**(3)** స్వాతంత్ర్యం భ్రాంతి క్రమంగా తగ్గుతుండడంతో పెట్టుబడిదారీ పంథాలోని అభివృద్ధి పరిమితులు యువజనుల దైనందిన జీవితంలో ప్రతికూల ప్రభావం చూపడం మొదలయింది. విద్యా, ఉపాధికల్పన రంగాలలో అరకొరగా మొదలయిన ప్రభుత్వపెట్టుబడి వ్యయం ఆ స్థాయిలోనైనా కొనసాగలేదు సరికదా తరువాత కాలంలో దిగజారింది. 1980 నాటికి ఇది మరింత స్పష్టంగా కనిపించింది.

1980 దశకంలో అఖిలభారత స్థాయిలో యువజన రంగం ఏర్పడిన నాటికే దేశంలో వివిధ విచ్ఛిన్నకర, వేర్పాటువాద, ఉగ్రవాద ఉద్యమాలు, కార్యక్రమాలు మొదలయ్యాయి. అస్సాం ఉద్యమం, ఖలిస్తాన్ ఉద్యమం ఈశాన్య ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యక్రమాలు ఈ కాలంలో ముఖ్యమైన విచ్ఛిన్నకర ధోరణులు.

అరవైలలో మొదలయిన వామపక్ష దుందుడుకువాదం అనేక చీలికలు పేలికలైనప్పటికీ యువకులలో కొంతమందిని అనేక కారణాల వల్ల ఆకర్షించడం కొనసాగింది.

వీటితోపాటు సామాజికంగా ప్రతికూల స్థితిలో వున్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులవారు, మైనారిటీలు, వికలాంగులు, మొదలైనవారు తమ అసమ్మతిని వ్యక్తం చేస్తూ సముచిత న్యాయం కోసం ముందుకురావడం కూడా ఈ కాలంలో జరిగింది. అందువల్ల దేశ సమైక్యత, సమగ్రతల పరిరక్షణలతోపాటు సామాజిక న్యాయాన్ని సాధించడం అనే డిమాండ్‌పైన కూడా మనం దృష్టిపెట్టాల్సి వచ్చింది. అదే సమయంలో విద్యా, ఉపాధి కల్పనలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ మనం ముందుకు తెచ్చిన “అందరికీ విద్య – అందరికీ ఉద్యోగం” అనే పోరాట నినాదం విస్తృత స్థాయిలో యువజనులను, విద్యార్థులను ఆకర్షించగలిగింది. ఈ 1980 దశకంలోనే వివిధ యువజన సంఘాలతో – వారు భిన్నమైన రాజకీయ ఒరవడులతో ఉన్నప్పటికీ ఐక్య కార్యాచరణను నిలకడగా కొనసాగిస్తూ వచ్చాము.

1990 దశకంలో మండల్ కమిషన్ సిఫార్సులు ప్రారంభం అయిన నేపథ్యంలో దానికి వ్యతిరేకంగా హిందుత్వ శక్తులు తీవ్ర విషపూరితమైన మతతత్వ ప్రచారాన్ని రేపాయి. ఇదే కాలంలో నయా ఉదారవాద విధానాల అమలు వేగం పుంజుకుంది. యువజన ఉద్యమం దిశ, దశ పెనుమార్పుకు లోనైంది. నయా ఉదారవాద విధాన చట్రంలో సరళీకరణ, ప్రయివేటీకరణ ఉపాధి కల్పనపై పెద్ద ఎత్తున దాడి చేశాయి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి వ్యయం బాగా పడిపోయింది. సామాజిక సంక్షేమ రంగాల్లోనూ తగ్గిపోయింది. సేవా రంగం ప్రయివేటీకరించబడింది. పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అంతరాల దుష్ప్రభావం యువజనులపై పడి వారు దుర్భర పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. అయితే విషాదకరమైనదేమిటంటే వివిధ రకాల మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తుల సైద్ధాంతిక విషప్రచారానికి ముఖ్యంగా హిందుత్వ శక్తుల ప్రభావానికి ఎక్కువగా గురైనదీ ఈ యువజనులే. ఈ క్రమమే హిందుత్వ శక్తులు కేంద్ర ప్రభుత్వంలో అధికారాన్ని, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారాన్ని హస్తగతం చేసుకునే ప్రస్తుత పరిస్థితిని తీసుకువచ్చింది.

క్రోనీ క్యాపిటలిస్టులతో సన్నిహిత సంబంధాలను హిందుత్వ శక్తులు

నెలకొల్పుకోవడం వలన ఈ హిందుత్వ ప్రాజెక్టు మరింత ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చడమే పరమావధిగా చేపడుతున్న చర్యలవలన శ్రామిక వర్గాల జీవితాలపై, ముఖ్యంగా యువజనుల జీవితాలపై పెను దాడులు జరుగుతున్నాయి. ఏటా 2కోట్ల చొప్పున 5ఏళ్ళపాటు ఉద్యోగాలు కల్పిస్తామని చేసిన మోసపూరిత వాగ్దానం గాలిలో కలిసిపోయింది. వాస్తవానికి ఉద్యోగాలు కుదించుకుపోతున్నాయి. ప్రయివేటు రంగంలో బుద్ధిజీవుల ఉద్యోగాలు సైతం ముఖ్యంగా ఐటి రంగంలో తగ్గిపోతున్నాయి. పెద్దఎత్తున వ్యాపారీకరణ, ప్రయివేటీకరణ జరుగుతున్న కారణంగా విద్యారంగంలోనూ ఇటువంటి స్థితే ఏర్పడుతున్నది. కార్పొరేట్లకు మాత్రమే అనుకూలంగా వుండేలా అమలవుతున్న ఈ విధానాలు యువజనుల ఆకాంక్షలను, అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

యువజనులలో హెచ్చు భాగాన్ని ముఖ్యంగా ప్రస్తుత విధానాలవల్ల నష్టపోతున్న యువజనులను మనం అందుకోలేకపోతున్నాం. దాంతో వారిలో గణనీయ భాగాన్ని హిందుత్వ శక్తులు తమవైపు లాక్కొని పోగలుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కనుమరుగవడం, చేతిలో పనిలేకపోవడం వలన యువజనులు సులువుగా హింసాత్మక, అరాచక కార్యకలాపాలవైపు ఆకర్షితులవుతున్నారు. మైనారిటీలపైన, మహిళలపైన, దళితులపైన, లౌకిక, శాస్త్రీయ భావాలను వ్యక్తం చేసే అభ్యుదయవాదులపైన పెరుగుతున్న హింసాత్మక దాడులు ఇందుకు నిదర్శనం. హిందుత్వ నాయకత్వం యొక్క సైద్ధాంతిక వాక్చాతుర్యం ఈ ధోరణులు పెంచడంలోనే ఉంది. **అందుచేత యువజనులను ప్రత్యామ్నాయ వామపక్ష ప్రజాతంత్ర వేదిక వైపు ఆకర్షించగలిగేలా యువజనోద్యమానికి తిరిగి దిశా-నిర్దేశం చేయడం తక్షణ అవసరం. లేకుంటే పరిస్థితుల్లో ఎటువంటి సానుకూల మార్పులనూ ఆశించలేము.**

ప్రజాతంత్ర ఉద్యమానికి కొత్త తరం యువతకు మధ్య తెగిపోయిన సంబంధాలను తిరిగి నెలకొల్పే విధానాల రూపకల్పనే ఇప్పటి మన ప్రధాన కర్తవ్యం. కార్పొరేట్ - అనుకూల విధానాలు అమలుచేయడం మత

విద్వేషాలను పెంచిపోషించడంతోపాటు నియంతృత్వం వైపుగా, రాజ్యాంగంలో ఉన్న పరిమిత ప్రజాతంత్ర హక్కులను సైతం కాలరాసే దిశగా ప్రభుత్వం నడుస్తున్నది. ఈ పరిస్థితులలో మన ముందున్న సవాళ్ళు చాలా గట్టివి. కాని వాటిని అధిగమించగలిగితే మనం పురోగమించడానికి చాలా గొప్ప అవకాశాలు ఉన్నాయి.

**(4)** జాతీయోద్యమంలో వేళ్లూనుకుని వున్న ఘనమైన వారసత్వం మనదేశ యువజనోద్యమానికి వుంది. ఆనాడు బ్రిటీష్ వలసపాలకులు యావత్ భారతదేశమంతటా తమ ప్రభావాన్ని విస్తరింపచేయడానికి వారికి ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పరచి నిర్వహించడం తప్పనిసరి అయింది. ప్రాథమిక, సెకండరీ పాఠశాల విధానాన్ని ఏర్పరచడానికి, కలకత్తా, ఢిల్లీ, బొంబాయి, మద్రాసులలో యూనివర్శిటీలు నెలకొల్పడాన్ని నిర్దేశిస్తూ జారీ అయిన వుడ్ ఆదేశాలు భారతదేశంలో బ్రిటిష్ పాలకుల ప్రయోజనాలు నెరవేర్చే ఒక తరహా భారతీయులను తయారుచేయడానికి ఉద్దేశించబడినవి. ఆలోచనలో బ్రిటీష్‌వారిగా, శరీరపు రంగులో భారతీయులుగా వ్యవహరించేవారిని తయారు చెయ్యాలన్నదే ఆ ఆదేశాల వెనుక లక్ష్యం.

అయితే, ఆధునిక విద్యా విధాన వ్యాప్తి ఆశించినదానికి భిన్నమైన ఫలితాలను తెచ్చింది. పరిమితంగానే అయినప్పటికీ, భారతీయ యువకులు యూరప్ నూతన చైతన్యంతో, ఫ్రెంచివిప్లవ భావజాలంతో ప్రభావితమైనారు. థామస్ పెయినే రచన "మానవుని హక్కులు" ఈ యువకుల అభిమాన గ్రంథం అయింది. వారి మేథో వికాసాన్ని అది ఇనుమడింపజేసింది. ఆ వెంటనే ఈ పురోగామి భావాలను ఈ దేశాన్ని విముక్తి చేయాలనే కర్తవ్యంతో జోడించడం జరిగింది. 1857 మహత్తర తిరుగుబాటు ప్రభావం కూడా ఈ యువజనుల మనోభావాలపై పడింది. 19వ శతాబ్దపు చివరి దశలో అసంఖ్యాకమైన యువజనుల బృందాలు అటు మేథోపరంగానూ, ఇటు ఉద్యమపరంగానూ స్వాతంత్ర్యం కోసం కృషిలో నిమగ్నం అయ్యాయి. 1917 అక్టోబర్ విప్లవం దోపిడీ లేని నూతన సమాజ స్థాపనను ఆవిష్కరించి జాతీయోద్యమానికి ఒక కొత్త

శక్తిని, ఊపును ఇచ్చింది.

యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు. అందుచేతనే జాతీయోద్యమంలో మూడు ధోరణులు యువజనుల్లో బలమైన ప్రభావాన్ని కలిగించగలిగాయి. విప్లవకారులు, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ఉద్యమాలు, బోల్షెవిక్ విప్లవం అనంతరం కార్మికులలో, రైతాంగంలో జరిగిన స్వతంత్ర కృషి – ఈ మూడు యువజనుల మనసులను ప్రభావితం చేశాయి. కానీ యువజనులను దేశవ్యాపితంగా కదిలించినది వీరకిశోరం భగత్‌సింగ్, అతని సహచరులు, వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలు. వారిచ్చిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' దేశమంతటా మార్మోగింది. విప్లవకారుల గ్రూపులు, 'అనుశీలన్', 'యుగాంతర్', బెంగాల్‌కు చెందిన సూర్యసేన్ నేతృత్వంలో జరిగిన చిట్టగాంగ్ తిరుగుబాటు, మహారాష్ట్రకు చెందిన ఛాపేకర్ సోదరుల తెగువ యువతపై ప్రధాన ముద్రవేశాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం కోసం స్కూళ్ళను, కాలేజీలను బహిష్కరించి రమ్మని గాంధీజీ ఇచ్చిన పిలుపు కూడా గణనీయంగా ప్రభావం కలిగించింది.

సాంఘిక సంస్కరణలకోసం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా జరిగిన సాంఘిక ఉద్యమాలు కూడా మరోవైపు యువజనులను ప్రభావితం చేశాయి. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా వుంటూనే యువజనులు అక్షరాస్యత ఉద్యమాన్ని, నిర్మాణాత్మక సామాజిక కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు చేరువైనారు.

ఈ విధంగా ప్రగతిశీల భావాలను అలవర్చుకున్న యువజనులను కార్యోన్ముఖులను చేయడానికి 1920, 1930 దశకాల్లో ఏర్పడిన వివిధ ప్రజాసంఘాలు, వర్గ సంఘాలు వేదికలు అయినాయి.

**(5)** ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక విశాల ఐక్య ఉద్యమ వారసత్వ నేపథ్యం స్వాతంత్ర్యానంతర కాలంలో యువజనుల ముందున్న కర్తవ్యానికి స్పష్టతనిచ్చింది. వివిధ తరగతుల ప్రజానీకం నుండి, వివిధ వర్గాలనుండి, వివిధమైన అస్థిత్వాల నేపథ్యం నుండి యువజనులను సమీకరించి

బహుళవర్గ సంఘంగా విశాల ప్రాతిపదికన యువజనులను సమీకరించడం యువజనోద్యమపు మౌలిక స్వభావాన్ని నిర్దేశిస్తున్నది. యువజనోద్యమానికిగల ఈ బహుముఖ, విశాల స్వభావం యువజనోద్యమం ముందున్న విస్తృతమైన అవకాశాలను సూచిస్తున్నది. అదే సమయంలో ఐక్య ఉద్యమంగా నిర్మించడంలో గల సంక్లిష్టతను కూడా సూచిస్తున్నది. విశాల ప్రాతిపదికపై ఐక్య పోరాటాలను నిర్మించడం యువజనోద్యమపు కర్తవ్యం. అదే సమయంలో యువజనులను చైతన్యపర్చడంకోసం వారికి శాస్త్రీయ సిద్ధాంత అవగాహన కల్పించడం అనేది కూడా ముఖ్యమైన కర్తవ్యం. స్వాతంత్ర్యం వచ్చినది మొదలు, ఈ లక్ష్యాలు, వాటిని వ్యక్తంచేసే రూపాలు యువజనుల కార్యాచరణలో చోటుచేసుకున్నాయి. యువజనులను సమీకరించి సంఘటితపరచి వారిని మౌలిక మార్పుల లక్ష్యాలవైపు నడిపించడంలో మనం వారి పిన్నవయస్సును, వారి విశాల బహుళవర్గ స్వభావాన్ని తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలి.

**(6)** యువజనులకుండే ఈ విశాల స్వభావానికి అనుగుణంగా విశాల సంస్థాగత నిర్మాణ దృక్పథాన్ని మనం అవలంబించాలి. జాతీయ స్థాయిలో కొన్ని డిమాండ్లను రూపొందించి ఒకేసారి జాతీయ స్థాయి నిర్మాణం సాధించవచ్చునని మనం భావిస్తే అది నష్టదాయకం అవుతుంది. యువజనులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపైన, వారి భవిష్యత్తుపైన స్థానికంగా ఎక్కడికక్కడ కొనసాగింపు ఉండే విధంగా నిలకడగా ఉద్యమాలు చేపడితేనే విశాల ప్రాతిపదికన యువజనులను సమీకరించాలనే లక్ష్యం నెరవేరగలదు. విశాల ప్రాతిపదికన సమీకరించాలనే కర్తవ్యం పునాది స్థాయిలోనే రూపుదిద్దుకోగలదు. అట్టి పునాది స్థాయి, విశాల ప్రాతిపదిక పోరాటాల అనుభవాలనుండి విశాల ఉద్యమాన్ని నిర్మించితేనే పెద్దఎత్తున యువజనులను సమీకరించే కర్తవ్యాన్ని నెరవేర్చడం సాధ్యం.

**(7)** ఇలా పునాది స్థాయిలో ఏర్పరిచే విశాల యువజనోద్యమాన్ని అల్లుకుంటూ జిల్లా స్థాయిలో, తర్వాత రాష్ట్ర, జాతీయ స్థాయిలలో విశాల ఉద్యమాలను నిర్మించగలుగుతాము. అంతేగాని పునాది లేకుండా అడ్డదారిలో నిర్మించడం

సాధ్యంకాదు. విశాల ప్రాతిపదికన సమస్యలను తీసుకుని డిమాండ్ల రూపొందించి యాంత్రికంగా పైస్థాయిలలో నేరుగా పిలుపులిచ్చి వాటిద్వారా యువజనులందరినీ సమీకరించవచ్చునని అనుకుంటే దానివలన యువజనులకుండే విశాల స్వభావం పూర్తిస్థాయిలో ఆవిష్కరించడం సాధ్యపడదు.

**(8)** విశాల ప్రతిపదికన యువజనోద్యమాన్ని నిర్మించడానికి సరైన దిశానిర్దేశం చేయడానికి, పెద్ద సంఖ్యలో యువజనులను పార్టీలోకి చేర్చుకోడానికి అనువుగా సిపిఐ(యం) మొదటి నుండీ ఒక నిలకడైన విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నది.

విద్యార్థులు, యువజనుల్లో పనిచేయాల్సిన ప్రాధాన్యతను మనం విస్మరించామనీ, ఈ పరిస్థితి కొనసాగరాదని మన పార్టీ ఆత్మవిమర్శనాపూర్వకంగా అంగీకరించింది. 1967 "పార్టీ నిర్మాణంలో మన కర్తవ్యాలు" అనే పత్రంలో ఈ విధంగా పేర్కొన్నారు: "దేశంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులపట్ల యువజనుల్లో సరైన చైతన్యం కలిగించడానికి, వారిని పాలకవర్గాలకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలలో సమీకరించడానికి వీలుగా విద్యార్థులమధ్య, యువజనులమధ్య తన కృషిని, తన శ్రద్ధను ఇంకా పెంచాలి".

అర్ధశతాబ్దం తరువాత కూడా ఈ పరిశీలనకు ఇప్పటికీ ఔచిత్యం ఉంది. ఇంకా చెప్పాలంటే ఇప్పుడు దీని ప్రాధాన్యత మరింత ఎక్కువగా ఉంది.

గ్రామీణ, పట్టణ ప్రాంతంలోని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతుల కుటుంబాల నుండి ఎక్కువ యువకులు వస్తుంటారు. వారిని విశాలమైన యువజనుల సంఘాలలోనికి ఆకర్షించేందుకు ప్రయత్నిస్తూనే, పైన చెప్పిన తరగతులలోని బాధలకు ఎక్కువగా గురైన కుటుంబాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఒకసారి యువజనోద్యమం బలపడితే, విశాలంగా స్థిరడితే, అందులోనుండే పార్టీ, వర్గ సంఘాలకు కీలక బాధ్యతలను తీసుకొనే వారిని ఎంపిక చేయటం మన ప్రధాన కర్తవ్యం అవుతుంది. 1967 పార్టీ నిర్మాణ కర్తవ్యాల పత్రం ఈ విషయాన్నే స్పష్టంగా చెప్పింది. "పార్టీ

విద్యార్థులలోనూ యువకులలోనూ పనిచేసేందుకు మరింత శ్రద్ధ చూపి ఉండవలసింది, వారిలో దేశంలోని వాస్తవ పరిస్థితుల పట్ల చైతన్యాన్ని పెంచి ఉండవలసింది, పాలకవర్గాలకు వ్యతిరేకంగా జరిగే వర్గపోరాటాల వైపు ఆకర్షించి ఉండవలసింది". అలాగే "విద్యార్థులను యువతరాన్ని వర్గపోరాటాలలోకి నిరంతరంగా ఆకర్షించకుండా, వారిని పార్టీ సభ్యులుగానూ, కార్యకర్తలగానూ, ప్రమోట్ చేయకుండా వర్గపోరాటాలకు ప్రజల విప్లవ పోరాటంలో నిరంతరంగా పెరుగుతున్న కార్యకర్తల అవసరాన్ని మనం అందుకోలేము."

1978 సాల్కియా ప్లీనం డాక్యుమెంటులో జాతీయ స్థాయి యువజన సంఘం ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. అటువంటి జాతీయ స్థాయి సంఘం గనుక ఏర్పడితే పెద్దఎత్తున యువజనులను సమీకరించడం, ప్రజాతంత్ర ఉద్యమంలో వారిని భాగస్వామ్యం చేయడం వేగవంతం కాగలదని భావించారు. యువజన, మహిళా సంఘాలను విస్తృత ప్రాతిపదికన బహుళవర్గ సంఘాలుగా అభివృద్ధి చేయడం, అప్పటికే ఏర్పడిన విద్యార్థి సంఘాన్ని అదే తరహాలో నడపడం అనే కర్తవ్యం పార్టీకి బహుళవర్గ ప్రజాసంఘాలకు మధ్య ఎటువంటి సంబంధాలుండాలి అన్న అంశాన్ని ముందుకుతెచ్చింది. దానిపై పార్టీ స్పష్టత ఇచ్చింది.

సరైన మార్క్సిస్టు, లెనినిస్టు అవగాహనా ప్రాతిపదికన పార్టీకి, ప్రజాసంఘాలకు మధ్య ఎటువంటి సంబంధాలుండాలి అన్నది వివరించడంకోసం 1981లో కేంద్రకమిటీ "ప్రజాసంఘాలపై" ఒక ప్రత్యేక పత్రాన్ని రూపొందించింది. 1980 దశకంలో యువజనోద్యమం అంతకుముందు కాలంలోకన్నా వేగంగా విస్తరించడం వెనుక ఇతర సానుకూల భౌతిక అంశాలకు తోడు ఈ పత్రం చాలా చైతన్యయుత పాత్ర నిర్వహించింది.

అయితే, ప్రస్తుతం దేశంలో నయా సరళీకరణ విధానాలు కలిగించిన తీవ్ర ప్రభావం నేపథ్యంలో ఈ రంగంలో మన కృషిని పునఃసమీక్షించి తగినవిధంగా ఉద్యమ దిశను సరిచేయవలసిన విషయం అత్యవసరంగా

ముందుకు వచ్చింది.

2004లో కేంద్రకమిటీ ఆమోదించిన "ప్రజాసంఘాల ఎడల మన వైఖరి" అన్న పత్రంలో పార్టీ పెరగాలంటే ప్రజాసంఘాలు విస్తరించడమూ, బలపడడము తప్పనిసరిగా జరగాలని, వాటిలో కొత్త తరగతుల ప్రజలు చేరడం అవసరమని పేర్కొన్నారు. యువజన రంగంలో మన కృషి కీలకంగా కొత్త తరగతుల ప్రజలను పార్టీవైపు ఆకర్షించడానికి తోడ్పడుతుంది. కొత్తగా తలెత్తిన సంక్లిష్ట పరిస్థితులు విద్యార్థి, యువజన రంగాలముందు కొత్త సవాళ్లను నిలిపాయి. వీటిని ఎదుర్కోవడానికి ఈ రంగాలలో దిశా-నిర్దేశం, ప్రాధాన్యతల నిర్ధారణకై ఒక విధానపర పత్రం రూపొందించాలని 18వ మహాసభ పార్టీని ఆదేశించింది. 2007లో విద్యార్థిరంగంపై విధానపత్రం రూపొందించి ఈ ఆదేశాన్ని పార్టీ పాక్షికంగా నెరవేర్చింది. ఆ కొరవ పూర్తి చేయడానికి 'యువజనరంగం - విధానం - కర్తవ్యాలు' అనే ఈ పత్రం ఇప్పుడు రూపొందించింది.

**విద్యార్థి ఉద్యమ స్వభావం గురించి "విద్యార్థిరంగం - విధానం - కర్తవ్యాలు" అనే పత్రం ఈ విధంగా పేర్కొంది. "వేగంగా ప్రభావితమయ్యే వయసులో ఉన్నందున విద్యార్థులు సమాజంలో జరిగే మార్పుల ప్రభావానికి తొందరగా లోబడతారు, ఏ దిశగా ఈ మార్పులు జరుగుతాయో వాటిపట్ల తొందరగా స్పందిస్తారు. అన్ని వర్గాలకు చెందినవారినుండి విద్యార్థులు వస్తారు గనుక వారు అన్ని వర్గాల ప్రజలతో సంబంధాలు కలిగి వుంటారు. అన్ని వర్గాల భావాల ప్రభావాలకు లోనవుతూ వుంటారు. ఏ సమయంలోనైనా సమాజంలో వివిధ భావాల మధ్య జరిగే సంఘర్షణకు విద్యార్థిలోకం ఒక వేదికగా వుంటుంది. స్వభావరీత్యానే భవిష్యత్తులో జరగబోయే మార్పుల దిశను ప్రభావితం చేయగలగడంలో విద్యార్థిలోకానిది ఒక ముఖ్యమైన పాత్ర".** యువజన సంఘం కూడా ఒక బహుళవర్గ సంఘం అయినందున చాలా ధోరణులు ఉమ్మడిగా విద్యార్థులతోపాటు ఉన్నందున పై నిర్ధారణలు యువజనులకు కూడా వర్తిస్తాయి. బహుళవర్గ సంఘం అయినప్పటికీ సామాజిక, ఆర్థిక మార్పులను వేగవంతం చేయడానికిగానీ, తిప్పి

కొట్టడానికిగానీ యువజన రంగం ముఖ్యమైన పాత్ర నిర్వహించగలదు. అందువలన ప్రస్తుత పత్రం ఈ ప్రాథమిక అవగాహన ఆధారంగా రూపొందించాలి.

**(9)** యువజన రంగం యొక్క కార్యక్రమం, నిబంధనావళిలో పొరపాట్లను సరిచేసినప్పటికీ ఈ రంగానికి సంబంధించిన మొత్తం అవగాహనలోని కొన్ని వైరుధ్యాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ రంగపు కార్యక్రమం తమ నిబంధనావళిలోని 12వ పేరాలో "జనతా ప్రజాతంత్రాన్ని నెలకొల్పడానికి, సమాజంలో సోషలిస్టు విధానాన్ని నెలకొల్పడానికి మార్గం సుగమం చేస్తుంది" అని వుంది. 1981 ప్రజాసంఘాలపై తీర్మానం ఇటువంటి సూత్రీకరణలను ప్రజాసంఘాలు చేయరాదని, వాటివల్ల పార్టీకి, ప్రజాసంఘాలకు తేడా లేకుండా పోతుందని హెచ్చరించింది.

భవిష్యత్‌పైన దృష్టిసారించే యువజన సంఘాలు రకరకాల సామాజిక వ్యవస్థలను చర్చించడం, తెలుసుకోవడం పట్ల, వాటి ప్రభావం యువకుల పై ఎలా ఉంటుందో వారికి విద్య, ఉద్యోగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు మొదలయిన వాటిలో అవకాశాలు ఉంటాయా ఉండవా అని తెలుసుకోవడం పట్ల ఆసక్తి కలిగిఉంటారు. అయితే వీటిని రోజువారీ జరిగే పోరాటాలు, సంఘాలు నిర్వహించే అధ్యయన కార్యక్రమాలతో అనుసంధానంగా మాత్రమే తెలుసుకోగలుగుతారు.

**(10)** మనం గతంలో చేసిన సూత్రీకరణలు, అంగీకరించిన విధానం ప్రాతిపదికన ఇక్కడ తిరిగి పునరుద్ఘాటించాల్సింది ఏమంటే యువజనరంగం సోవియట్ కాలంలోని కమ్యూనిస్టు యూత్ లీగ్ వంటిది కాదు. కమ్యూనిస్టు పార్టీలతో యువజనోద్యమం సన్నిహితంగా పెనవేసుకొని వున్న కొన్ని దేశాల్లో ఇప్పటికీ ఆ వారసత్వమే కొనసాగుతోంది. మనదేశానికి సంబంధించి ఇటువంటి పొరపాటు అవగాహనలకు మొత్తంగా స్వస్తి చెప్పాలి. విశాల ప్రాతిపదిక లేని, స్వతంత్రంగా, ప్రజాతంత్రయుతంగా వ్యవహరించని యువజన రంగం మనకిక వద్దు. పార్టీలోకి యువజనులు హెచ్చు సంఖ్యలో చేరాలంటే ఆ పని యువజన రంగంలో పనిచేసే పార్టీ

సభ్యులద్వారా మాత్రమే జరగాలి. కనుక పార్టీ కమిటీలు యువజన రంగం పనిలో నేరుగా జోక్యం కల్పించుకోరాదు. యువజన రంగాన్ని బలోపేతం చేయాలన్నా, పార్టీలోకి, ప్రజాతంత్ర ఉద్యమంలోకి ఎక్కువమంది యువజనులను చేర్చుకోవాలన్నా ఆ కర్తవ్యం యువజనరంగంలో పనిచేసే పార్టీ సభ్యులకు మార్గదర్శకత్వం పార్టీ ఏర్పరిచిన ఫ్రాక్షన్ ద్వారాగానీ, సబ్‌కమిటీ ద్వారాగాని జరగాలి. **ఈ అవగాహన పార్టీలోని అన్ని స్థాయిల కమిటీలకు, యువజన రంగంలో పనిచేస్తున్న పార్టీ సభ్యులకు కల్పించాలి.**

**(11)** వారి వయస్సురీత్యా యువజనులు తమచుట్టూ శరవేగంగా జరుగుతున్న మార్పులకు స్పందిస్తారని, ప్రభావితులవుతారని ముందే చెప్పుకున్నాం. ఒకవైపు యువజనులు మొత్తంగా అటువంటి మార్పులకు, వాటి పర్యవసానంగా కలిగే అనుభవాలకు లోనవుతూ వుంటే పార్టీ తనవంతుగా వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, వాటి ప్రభావం ఎంత వుందనేది అంచనా వేస్తూ వున్నప్పుడే యువజనోద్యమాన్ని నిర్మించడంగానీ, నిర్మాణ పద్ధతులను అమలు చేయడంగానీ సాధ్యపడుతుంది. పోరాటాలపట్ల, నిర్మాణ పద్ధతులపట్ల తమ అవగాహనను ఎప్పటికప్పుడు తాజాపర్చుకోవడం యువజనరంగంలో పనిచేసే కార్యకర్తలకు అవసరం. అదే సమయంలో పార్టీ కమిటీల ద్వారా యావత్ పార్టీని ఈ రంగానికి సంబంధించి అప్రమత్తం గావించాలి.

**(12)** ఈ నేపథ్యంలోనే నయా సరళీకరణ విధానాలు మన సమాజంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవితాన్ని ఎంత బలంగా ప్రభావితం చేస్తున్నాయో మనం పరిగణించాల్సి వుంది. యువజనులపై ఈ ప్రభావం ఎంత? యువజనుల్ని సంఘటితపరిచే క్రమంలో మన వైఖరిలో ఎటువంటి మార్పుల అవసరం వుంది? మన సమాజంలో ఒక పెద్ద బహుళవర్గ విభాగంగా యువజనులు వున్నారు. యువజనుల ఈ లక్షణాలను బట్టి అన్ని తరగతుల యువజనులను మనవైపు ఆకట్టుకునే విధంగా మన ప్రయత్నం వుండాలి. ఇప్పటికే 25 సంవత్సరాలకు పైబడి అమలవుతున్న నయా సరళీకరణ విధానాల అనుభవం మనకుంది.

**దాన్నిబట్టి ఈ విధానాల అమలు ప్రభావం అన్ని తరగతుల యువజనులపైన ఒకే తీరుగా పడడంలేదని మనం చెప్పగలం. ఈ విధానాల పర్యవసానంగా పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతల ప్రభావం అత్యధికంగా పడుతున్న తరగతుల యువజనులపైన, ఉపాధి రహిత అభివృద్ధి ప్రభావం వల్ల నష్టపోతున్నవారిపైన ప్రధానంగా దృష్టిపెట్టి వారికి అత్యధిక ప్రాధాన్యత వుండేలా యువజనరంగం రూపొందించే కార్యక్రమాలు వుండాలి. ఈ ప్రాధాన్యతను సరైన రీతిలో తిరిగి స్పష్టీకరించుకోకుండా యువజనోద్యమం బలాన్ని, వేగాన్ని పుంజుకోజాలదు. అయితే ఈ క్రమంలో యువజనరంగపు విశాల ప్రాతిపదిక ఏమాత్రమూ దెబ్బతినకుండా జాగ్రత్త వహించాలి.**

**(13)** ప్రజాసంఘాలతో ఉండవలసిన సంబంధం గురించి, వాటిపట్ల తీసుకోవాల్సిన వైఖరి గురించి మనం ఇదివరకే ఒక నిర్ధారణకు వచ్చి ఉన్నాం. ప్రజాసంఘాన్ని నిర్మించే బాధ్యత కేవలం ఆ రంగంలో పనిచేసే పార్టీ సభ్యులది మాత్రమే అని భావించరాదు. ఆ బాధ్యత ప్రధానంగా పార్టీది. కనుక పార్టీ తన బాధ్యతను నెరవేర్చే విధానంలో మార్పు రావాలని మనం కోరుతున్నామని అర్థం చేసుకోవాలి. నిరంతరం వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుంటూ వాటికనుగుణంగా యువజనరంగ కార్యకర్తల అవగాహనను సరిచేస్తూ వారిలోని స్వతంత్ర, సృజనాత్మక చొరవను ప్రోత్సహించి వెలుగులోకి తెచ్చేలా పార్టీ తన మార్గదర్శకత్వ పాత్రను మార్చుకోవాలి. **అందుచేత అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులలో వస్తున్న మార్పులు యువజనులను నిర్దిష్టంగా ఎలా ప్రభావితం చేస్తున్నాయో నిరంతరం పార్టీ అధ్యయనం చేయవలసిన అవసరం వుంది.** అందుచేత 21వ పార్టీ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక నొక్కి చెప్పినట్టుగా ప్రతి సంవత్సరమూ యువజన రంగంలో మన పనిని సమీక్షించడం తప్పనిసరి.

**(14)** మన అనుభవాలనుబట్టి చూస్తే విద్యార్థులకు, యువజనులకు విడి విడిగా ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పాటు చేసి పని చేయించినందువలన కొన్ని సానుకూల ఫలితాలు వచ్చాయన్నది స్పష్టం. అదే సమయంలో ఈ రెండు

రంగాలకు వున్న కొన్ని ఉమ్మడి లక్షణాల వలన ఉమ్మడిగా చేపట్టవలసిన సమస్యల వలన ఈ రెండు రంగాల మధ్య సమన్వయం ఉండేలా చూడడం పార్టీ కమిటీ బాధ్యత. ఇందుకోసం వివిధ స్థాయిలలో విద్యార్థి, యువజన పార్టీ కమిటీ కొద్దిమందితో ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. ఈ కమిటీలలో ఈ రెండు విభాగాల ముఖ్య నాయకులతోపాటు ఆ రంగాలకు పార్టీ నుండి ఇన్‌ఛార్జిలుగా వుండేవారు కూడా ఉంటారు. ఈ కమిటీ ముందుండేది ఈ రెండు కర్తవ్యాలు : 1.యువజన రంగం యొక్క విశాల స్వభావాన్ని నిలబెడుతూ విస్తారంగా యువజనులను సంఘం వైపు ఆకర్షించడం 2. ఈ రంగంలోని కార్యకర్తల్లో అన్ని పరీక్షలకు తట్టుకొని శిక్షణ పొందినవారిని హెచ్చు సంఖ్యలో పార్టీలోకి ఒక క్రమ పద్ధతిలో చేర్చుకోవడం, వారికి నిరంతరం శిక్షణ ఇస్తూ ప్రజాతంత్ర ఉద్యమంలోని వివిధ బాధ్యతలు వారు చేపట్టేటట్టు చూడడం. విశాల ప్రాతిపదికన **యువజనోద్యమాలను విస్తృతంగా నిర్మించకుండా యువరక్తం పార్టీలో పెరగకుండా పార్టీగా మనకు భవిష్యత్తు లేదని కలకత్తా ప్లీనం నొక్కి చెప్పిన విషయం ప్రాధాన్యతను మనం గమనించాలి.**

**అయితే రాష్ట్ర పార్టీ కమిటీ ఇప్పుడున్నట్టుగానే యువజన విద్యార్థి ఫ్రాక్షన్ కమిటీలు వేరు వేరుగా ఉండడం సరిపోతుందని సమర్థవంతంగా ఉంటుందని భావించినట్టయితే వాటిని కలపాల్సిన అవసరం లేదు. యువజన విద్యార్థి జాయింట్ కమిటీలు బాగా పనిచేస్తాయని భావించిన రాష్ట్రాలలో మాత్రమే వాటిని కలవవచ్చు. ఇవి ప్రత్యేకంగా దేనికి దానికే ఉండడం అన్నది ఆయా రాష్ట్ర కమిటీలపైన ఆధారపడి ఉంటుంది. ఈ జాయింట్ కమిటీలు రెండు సంఘాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరగవలసినప్పుడు మాత్రమే కలవాల్సి ఉంటుంది. జాయింట్ కమిటీలు మూడు నాలుగు నెలలకు వేస్తే సరిపోతుంది లేదా ఏదైనా ముఖ్యమయిన అంశం చర్చించాలనుకున్నప్పుడు వేసుకోవచ్చు.**

**(15)** ఈ రెండు రంగాల సమన్వయ వేదికద్వారా రెండు రంగాల్లోని

పోరాటాలనూ, నిర్మాణాలను పరస్పరం బలోపేతం చేసుకునే కార్యక్రమాలను రూపొందించడానికి పార్టీకి సాధ్యపడుతుంది. కార్యకర్తల కేటాయింపు సముచితంగా జరిగేందుకు ఇది తోడ్పడుతుంది. చాలా సందర్భాల్లో ఒక చైతన్యపూరితమైన దీర్ఘకాలిక ప్రణాళిక లేకుండా యువజన రంగ కార్యకర్తలకు నేరుగా పార్టీ, వర్గ సంఘాల బాధ్యతలను కేటాయిస్తున్నారు. యువజన రంగాన్ని ఒక విశాల ప్రాతిపదికన సంఘటితం చేయాల్సిన కర్తవ్యంపై ఈ కార్యకర్తలు తమ దృష్టిని పెట్టవలసి వుండగా ప్రస్తుత విధానం ఆ ప్రాధాన్యతను తగ్గిస్తోంది.

**(16)** వారి వయస్సు, అనుభవ రాహిత్యం రీత్యా యువజన కార్యకర్తలకు రాజకీయ విద్య గరపడం అత్యంత ప్రాధాన్యత గలిగిన అంశం. వీరికి రాజకీయ విద్య అందించే ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలి. **వారి సైద్ధాంతిక, రాజకీయ అవగాహనను పెంపొందించడం, భారతదేశ చరిత్ర సమాజం సంస్కృతి గురించి క్షుణ్ణంగా తెలియజెప్పి అవగాహన కల్పించడాన్ని నిర్లక్ష్యంచేస్తే మన పార్టీకే ముప్పు. ఇంటర్నెట్ ద్వారా లభిస్తున్న సమాచార వనరులను ఉపయోగించుకుని స్వీయాధ్యయనం పెంపొందించుకునేలా వారిని ప్రోత్సహించాలి.** ఈ రాజకీయ విద్య శిక్షణ నిరంతరాయంగా కొనసాగింపు ఉండేలా జరగాలి. రాజకీయ విద్యతోపాటు యువ కార్యకర్తలను రిక్రూట్ చేయడం, ప్రమోట్ చేయడంపై కూడా పార్టీకి నిర్దిష్ట ప్రణాళిక ఉండాలి.

ఈ రిక్రూట్‌మెంట్ విషయంలో ఒక ప్లాన్ అంటూ లేకుండా పోవడం అనేది తరచుగా జరుగుతోంది. పార్టీ పని చేసే ప్రాంతం యువజన రంగం చేసే పని ప్రాంతం భౌగోళికంగా ఒకటి కావడం అనేది మరో సమస్య. యువజన రంగానికి ఉన్న బహుళవర్గ స్వభావం రీత్యా వారు స్వతంత్రంగానూ, ఇతర ప్రజాసంఘాలతో ఉమ్మడిగానూ అన్ని ముఖ్యమైన సమస్యను చేపట్టగలరు. అలా కార్యాచరణలో సరిగ్గా చేయడం నేర్చుకుంటారు. అదివారికి ఆత్మ విశ్వాసాన్ని ఇచ్చి బాధ్యతాయుతమైన కార్యకర్తలుగా తయారయ్యేందుకు సహకరిస్తుంది. వారు చేసిన తప్పులను

స్నేహ పూర్వక విమర్శలతో సరిచేయడం, బాగా చేసినప్పుడు హృదయ పూర్వకంగా అభినందించడం ఎంతో అవసరం. అటువంటి వైవిధ్యభరితమైన అనుభవం కలిగిన యువకార్యకర్తలు ఉండడం ఆయా ప్రాంతాల పార్టీ కమిటీల బలోపేతానికి తోడ్పడుతుందని గమనించాలి.

**(17)** వేర్వేరు సామాజిక విభాగాల పట్ల ఆయా ప్రత్యేకతలకనుగుణంగా మనం చేపట్టవలసిన వైఖరిని దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాల్సి వుంటుంది. చారిత్రకంగా అన్యాయానికి గురైన తరగతులు, నయా సరళీకరణవాదం ప్రమాదానికి ఎక్కువగా బలవుతున్న తరగతులు వున్నాయి. వారిపట్ల ప్రత్యేక వైఖరి అవలంభించాలి. అదే విధంగా యువజన రంగంలోనూ, యువతులు, దళితయువత, గిరిజన యువత, మైనారిటీ యువత, వెనుకబడ్డ తరగతుల యువత వీరిపట్ల ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి వెంటనే అమలు చేయాలి.

**(18)** యువజనులలో సగం మంది మహిళలు. వారిని యువజనోద్యమంలోకి తీసుకుని రావడం ఒక ముఖ్యమైన కర్తవ్యం. ఈ కర్తవ్యానికి తగిన ప్రాధాన్యతను ఇప్పటి వరకు ఏర్పరచిన కమిటీ యివ్వలేదు. సామాజిక, లింగ వివక్షతకు సంబంధించిన యువతుల సమస్యలకు తగిన ప్రాధాన్యతనివ్వాలి. నయా ఉదారవాద విధానాలు అమలు చేసిన తరువాత, మహిళలను కూడా వస్తువులుగా చూడడం మొదలవడం వలన మహిళలపై వేధింపులు పెరిగాయి. మతం పేర కులంపేర మహిళలు నాలుగు గోడల మధ్య బంధింపబడి ఉండాలన్న ధోరణి పెరుగుతున్నది. ఖాఫ్ పంచాయిత్‌లు గాని రోమియో స్క్వాడ్‌లుగాని మహిళల ప్రాథమిక హక్కులకు, మానవ హక్కులకు అడ్డుగోడలు కడుతున్నాయి. యువజన సంఘాలు ముఖ్యంగా మహిళా విభాగాలు ఈ సమస్యలను స్వతంత్రంగా గానీ కలిసివచ్చే సంఘాలతో కలిసిగాని తీసుకుని పని చేయాలి.

**(19)** యువజన రంగంలో అనుసరించే బహుముఖ వైఖరిలో ఉద్యమాలు నడపడం నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టడం రెండూ కలిసి వుండాలి. ఇటువంటి నిర్మాణాత్మక కార్యక్రమాల్లో సృజనాత్మకంగా వుండే వర్క్

ప్రాజెక్టులు విద్య, ఉపాధి వంటి అంశాల నిర్దిష్ట అధ్యయనం, సాంస్కృతిక, సాహిత్య, క్రీడా ఉత్సవాల నిర్వహణ, అక్షరాస్యత ఉద్యమం, పౌరగ్రంథాల ఉద్యమం, పర్యావరణ పరిరక్షణలో జోక్యం కల్పించుకోవడం, యువతకు ప్రయోజనకరంగా వుండే ప్రభుత్వ ప్రాజెక్టుల మెరుగైన అమలుకోసం యువతను సమీకరించడం వంటివి ఉండాలి. వివిధ తరహాల వివక్షను ఎదుర్కొనే తరగతులమధ్య పనికి అధిక ప్రాధాన్యతనివ్వాలి.

**(20)** పచ్చి మితవాద హిందుత్వ శక్తుల దుర్మార్గపూరితమైన జోక్యంతో శాస్త్ర విజ్ఞానంపైన, హేతుబద్ధతపైన దాడి తారా స్థాయికి చేరుకుంది. చరిత్రను వక్రీకరించడం, తిరగరాయడం, ఇతర సామాజిక శాస్త్ర విభాగాలలోనూ, సాహితీ సాంస్కృతిక రంగాల్లోనూ జోక్యం కల్పించుకోవడం వంటి చర్యల ద్వారా ఇది వ్యక్తం అవుతోంది. శాస్త్ర విజ్ఞాన పద్ధతులపైనే ఈ శక్తులు దాడి ఎక్కుపెట్టాయి. తార్కికమైన, హేతుబద్ధమైన చర్చలను తిరస్కరించి పిడివాదం, అభివృద్ధి నిరోధకత్వం, ఛాందసత్వంతో కూడిన భావాల ఆసరాతో ఎదురుదాడులు చేస్తున్నాయి. పోస్ట్ మోడరన్ వాదనలు కూడా యువతపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. ఈ హిందుత్వ శక్తులు ప్రదర్శించే దాష్టీకానికి తోడు అస్థిత్వవాదంపై ఆధారపడ్డ పాక్షిక దృష్టితో కూడిన విచ్ఛిన్నకర వాదనలు కూడా ఇటువంటి తిరోగమన భావాలవైపే నడిపిస్తాయి. అందుచేత శాస్త్రీయ దృష్టిని, అభ్యుదయ, లౌకిక చైతన్యాన్ని పెంపొందించే దిశగా జరగవలసిన కృషి ప్రాధాన్యత ఎన్నో రెట్లు పెరిగింది. యువజన రంగంలోని మన కృషిలో దీనికి అదనపు ప్రాధాన్యత వుంది.

**(21)** యువజనులు కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి తొందరగా స్పందిస్తారు. వాటిని అమలులో పెట్టడానికి ముందుకు వస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో అభిప్రాయాల వ్యాప్తిలో, సమాచార సేకరణలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం పాత్ర చాలా ప్రముఖంగా వుంది. ఈ టెక్నాలజీని కేవలం సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి మాత్రమే గాకుండా సమీకరించడానికి కూడా సాధనంగా సోషల్ మీడియా వుంది. ఇటీవలి ఘటనల్లో ప్రపంచవ్యాపితంగా

వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రాచుర్యం పొందిన నిరసన కార్యక్రమాల్లో సోషల్‌మీడియా ఎటువంటి పాత్ర పోషించిందో తెలియజెప్పే కథనాలు కుతూహలం కలిగిస్తున్నాయి. 2017 ఎన్నికల సందర్భాల్లో యువత లేబర్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడంలో సోషల్ మీడియా పాత్రకు సంబంధించిన సవివరమైన కథనాలు బ్రిటీష్ మీడియాలో వెలువడ్డాయి. తమ పనిలో యువజన రంగం కార్యకర్తలు ఈ పరిణామాల ప్రాధాన్యతలను, రానున్న కాలంలో ఇందులో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు పరిగణనలోనికి తీసుకొని వ్యవహరించాలి. టెక్నాలజీని సోషల్ మీడియాను సృజనాత్మకంగా ఉపయోగించడం ఆవశ్యము, అనివార్యము అయింది. అయితే ఈ సందర్భంగా ఒక జాగ్రత్త తీసుకోవాలి. ప్రత్యక్షంగా యువజనులను కలుసుకోవడం, వారిని ఉద్యమాల్లో సంఘటితపర్చడం అనేది మన ప్రధానమైన పని. దీనిని చెడగొట్టే విధంగా మన సోషల్ మీడియా పని ఉండరాదు.

**(22)** ఫిబ్రవరి 2017లో కొచ్చిలో జరిగిన యువజన రంగ 10వ జాతీయ మహాసభల్లో యువజన రంగ కార్యక్రమానికి చేసిన సవరణల్లో పైన పేర్కొన్న కొన్ని అంశాలు వ్యక్తమయ్యాయి. క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లో ప్రముఖులైన యువతను కమిటీలలో ఓటింగ్ హక్కులు లేని గౌరవ సభ్యులుగా నామినేట్ చేయడానికి వీలు కల్పించారు. మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా యువజనరంగ విశాల ప్రాతిపదికను మరింతగా విస్తృతపర్చడంలో ఇదొక ప్రయత్నం. ఇంకా మరెన్నో ఇటువంటి ప్రయత్నాలను కొత్త అవసరాలు, కొత్త ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు చేపట్టే విధంగా మన కృషి వ్యవస్థీకృతం కావాలి.

**(23)** యువజనరంగం పట్ల మారిన పార్టీ వైఖరికనుగుణంగా దిగువన పేర్కొన్న ప్రధాన కర్తవ్యాలపై పార్టీ దృష్టిని కేంద్రీకరించాలి.

**(i)** యువజనరంగంలో పనిచేస్తున్న యువ కార్యకర్తలను తక్షణమే పార్టీలోకి ఒక పద్ధతి ప్రకారం నిర్ణీత కాల వ్యవధిలోపు చేర్చుకోవాలి.

**(ii)** పార్టీయొక్క వివిధ స్థాయిల్లో నాయకత్వంలో యువత పాత్ర పెరిగేలా

అందుకనుగుణంగా పార్టీ వైఖరి ఉండేలా చర్యలను వెంటనే ప్రారంభించాలి. ఈ విషయాన్ని ఇప్పటికే కలకత్తా ప్లీనంలో నొక్కి చెప్పారు.

**(iii)** వర్గ సంఘాల్లోనూ ఇటువంటి ప్రయత్నాలే చేపట్టాలి. యువ కార్మికుల, యువ రైతుల సమస్యలపై దృష్టి సారించాలి. నిరుద్యోగం, అర్హతకన్నా దిగువ స్థాయి ఉద్యోగాలు చేయడం నయా సరళీకరణ కాలంలో బాగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కర్తవ్యానికి అదనపు ప్రాధాన్యత వుంది. ఈ అంశానికి సంబంధించి ఈ వర్గ సంఘాల వేదికలు యువజన రంగంతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టే అవకాశాలు మెండుగా వున్నాయి.

**(iv)** యువజన రంగానికి సంబంధించిన ఈ విధాన పత్రంలోని అవగాహనను పరిగణలోనికి తీసుకొని పార్టీ మహాసభల సందర్భంగా అంచనాలను రూపొందించాలి. శాఖ స్థాయినుండి కేంద్ర కమిటీ స్థాయివరకు ఇది అమలు జరగాలి.

**(v)** విద్యార్థి, యువజన ఉపకమిటీల ఏర్పాటు వివిధ స్థాయిల్లో జరగాలి. కేంద్ర కమిటీ స్థాయిల్లో ఇదివరకే ఈ ఉపకమిటీ ఏర్పడి వుంది. యువజన రంగంలో కృషిపై సమీక్షను ప్రతి సంవత్సరమూ ఆయా పార్టీ కమిటీలు చేయాలి. ఇట్టి సమీక్షలు తుదిరూపం తీసుకోగానే వాటిని తమ పై కమిటీకి సమర్పించాలి. పార్టీ, ప్రజాసంఘాల మధ్య సంబంధాలపై పార్టీ అవగాహనను యువజన రంగంలో కచ్చితంగా అమలు చేయాలి. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే తీవ్ర చర్యలు గైకొనబడతాయి.

**(vi)** యువజనులను పూర్తికాలం కార్యకర్తలుగా రిక్రూట్ చేసుకోవడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేపట్టాలి.

**(vii)** యువజన రంగం కృషిలో సామాజిక వివక్షతకు, లింగ వివక్షతకు సంబంధించిన అంశాల ప్రాధాన్యతను నొక్కి చెప్పాలి.

(viii) ప్రత్యేకంగా ఒక క్రమ పద్ధతిలో యువజనులలో సైద్ధాంతిక కృషిని బలోపేతం చేసే చర్యలను చేపట్టాలి.

(ix) పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు సంబంధిత సమస్యలలో యువత జోక్యం పెరిగేలా ప్రత్యేక కృషి జరగాలి.

(x) శరీరాన్ని ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుకునే సంస్కృతిని శరీరం, మనస్సు రెండూ సమగ్రంగా అభివృద్ధి చెందాలనే ఒరవడిని యువజనుల్లో పెంపొందించాలి.

(xi) అందుబాటులో ఉన్న చదవుకున్న నైపుణ్యంగల యువకులను, దృఢంగా ఉండి నైపుణ్యంగల పెన్షనర్లను ఒక చోట చేర్చి పోటీ పరీక్షలకు వెళ్ళేందుకు యువకుల కోసం, విద్యార్థుల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. ఇవి ధార్మిక సంస్థలగానో సహకార సంఘాలగానో ఉండవచ్చు. అల్పాదాయ వర్గాలవారు నివసించే ప్రాంతాలలో యువజన సంఘాలు పమర్థులైన టీచర్లతో, యువకులకు ట్యూషన్ సెంటర్లను, చదువురాని పెద్దలకు రాత్రిబళ్ళను పెట్టవచ్చు.

(xii) యువజన సంఘాలు కొత్త కొత్తరంగాలలో పనిని చేయవచ్చు. వాడలలోకి, కాలనీలలోకి, గిరిజన తండాలలోకి, నివాసప్రాంతాలలోకి, సంఘ సరివార్, ఇతర వేర్పాటువాద మత సంస్థలు చొచ్చుకుని పోతున్నాయి. మన చొరవతో మాత్రమే వాటి కార్యక్రమాలను నిలువరించగలం.

(xiii) యువజన రంగంలోని కర్తవ్యాలకు తుదిరూపం ఇచ్చేటప్పుడు ఒక దీర్ఘకాల ప్రణాళిక తగిన లక్ష్యాలతో రూపకల్పన జరగాలి.

(xiv) యువతుల శాతాన్ని పెంచడమనే కర్తవ్యం తక్షణ ప్రాధాన్యతను సంతరించుకుంది. దీనిని బలోపేతం చేయడానికి వెంటనే చర్యలు ప్రారంభించాలి.

(xv) ప్రపంచంలో శరవేగంగా మార్పులు జరుగుతున్నాయి. సమాచారం, భావాలు పెద్ద ఎత్తున విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో యువతలోని

ఉత్సాహాన్ని, తపనను దృష్టిలో వుంచుకొని వారిలో స్వతంత్రంగా స్వేచ్ఛగా ఆలోచనలు వికసించేలా ప్రోత్సహించాలి. అయితే ఈ పని మన రాజకీయ సైద్ధాంతిక అవగాహనకు, నిర్మాణ చట్రానికి లోబడి ఉండేలా చూసుకోవాలి. యువజనరంగంలో మన కర్తవ్యాన్ని నిర్దేశించే ఈ డాక్యుమెంట్లలో నిర్దేశించిన అవగాహనకు అనుగుణంగా పార్టీ తన వైఖరిని తగు విధంగా సవరించుకున్న విషయం డాక్యుమెంట్ అమలులో ప్రతిబింబించాలి.

***


ప్రతులు : 2000

ప్రచురణ కాలం : జనవరి, 2018

వెల : ₹ 10/-

132412

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,

గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042